సాక్షి
ప్రకాశం
శనివారం । 22 । జూలై । 2023



పురంపై సంక్షేమ శరం

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక మార్కాపురం నియోజకవర్గంపై నిధుల వరద కురిపించారు. రూ.1300 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. - IIలో..



రోడ్డు ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థి మృతి

రోడ్డు ప్రమాదంలో ఓ ఇంజినీరింగ్ విద్యార్థి మృతిచెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. - IIలో..

గరిష్టం/కనిష్టం
34/28

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

డిగ్రీ వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ముమ్మరం



డిగ్రీ వెబ్ ఆప్షన్ల ప్రక్రియలో పాల్గొన్న విద్యార్థిని

ఒంగోలు: డిగ్రీ వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ముమ్మరంగా జరుగుతున్నట్లు డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కళ్యాణి, అడ్మిషన్స్ కోఆర్డినేటర్ డాక్టర్ జి.ధనుంజయరావు పేర్కొన్నారు. శుక్రవారం డీఎస్ ప్రభుత్వ మహిళా కాలేజీలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ ప్రక్రియను విద్యార్థులు వినియోగించుకుంటున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ డిగ్రీ ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకుంటున్నారన్నారు. కేవలం తమ కళాశాలకు వెబ్ ఆప్షన్లు పెట్టుకునేవారు మాత్రమే కాకుండా ఇతర కళాశాలలకు వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాలనుకుంటున్న వారికి కూడా సాంకేతిక సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. తమ కాలేజీలో ఉచితంగా హాస్టల్ వసతి ఉందని, అన్ని గ్రూపుల విద్యార్థులు దీనికి అర్హులన్నారు.

అండర్ 16 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక రేపు

ఒంగోలు: అండర్ 16 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక ఈనెల 23న స్థానిక మంగమూరు రోడ్డులోని ఏసీఏ మినీ గ్రౌండులో నిర్వహిస్తున్నట్లు ప్రకాశం జిల్లా అడ్‌హక్ కమిటీ కన్వీనర్ ఎం.వీరరాఘవరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికకు 2007 సెప్టెంబర్ 1వ తేదీ మొదలు 2009 సెప్టెంబర్ 1వ తేదీ మధ్య జన్మించిన వారు మాత్రమే అర్హులన్నారు. ఈ ఎంపికకు వచ్చేవారు ఫారం 5 సర్టిఫికెట్, వయస్సు ధ్రువీకరణ, స్టడీ సర్టిఫికెట్ తీసుకురావాలన్నారు. తప్పనిసరిగా తెల్లటి దుస్తులు, బూట్లు ధరించి హాజరుకావాలన్నారు. పూర్తి వివరాలకు సెల్: 9246222999 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

అగ్రిల్యాబ్‌లు పూర్తి స్థాయిలో పనిచేయాలి

● మంత్రి ఆదిమూలపు సురేష్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సురేష్

ఒంగోలు అర్బన్: రైతులకు ఉపయోగపడే అగ్రిల్యాబ్‌లు పూర్తి స్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. ప్రకాశం భవనంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీఎం కిసాన్‌కు సంబంధించి ఈకేవైసీ ప్రక్రియ నెలాఖరు లోపు పూర్తి చేయాలన్నారు. అగ్రిల్యాబ్‌ల్లో సిబ్బంది కొరత లేకుండా చూడాలన్నారు. పార్లమెంట్ సభ్యుడు మాగుంట శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులను వచ్చే నెలాఖరు లోపు అందించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎఫ్‌పీజీ గ్రూపులను ఏర్పాటు చేసి వారికి రుణాలు ఇప్పించాలన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందన్నారు. సమావేశానికి జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఆళ్ల రవీంద్రా రెడ్డి అధ్యక్షత వహించగా వ్యవసాయ శాఖ జేడీ శ్రీనివాసరావు, పశు సంవర్ధక శాఖ జేడీ బేబిరాణి, ఉద్యాన అధికారి గోపిచంద్, మత్స్యశాఖ జేడీ చంద్రశేఖర్ రెడ్డి, ఏపీఎంఐపీ పీడీ ఎంపీ రమణ పాల్గొన్నారు.

ప్రగల్భాలొద్దు.. ఉత్తర కుమారా..!

ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లో కరువు ప్రాంతాలను సస్యశ్యామలం చేసేందుకు నాడు మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి వెలిగొండ ప్రాజెక్టు పనులు ప్రారంభించారు. ఆయన హయాంలో పనులు వేగంగా జరిగాయి. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన చంద్రబాబు పనుల పేరుతో నిధులను కాంట్రాక్టర్లకు దోచిపెట్టారు. ప్రాజెక్టును గాలికొదిలేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత పనులు వేగవంతం చేశారు. మొదటి సొరంగం పనులు పూర్తి చేశారు. రెండో సొరంగం పనులు సెప్టెంబర్ నాటికి పూర్తి చేసి కృష్ణా జలాలను పరుగులు తీయించేందుకు వడివడిగా అడుగులు వేస్తున్నారు. యువగళం పేరుతో జిల్లాలో పాదయాత్ర చేస్తున్న నారా లోకేష్ వెలిగొండపై వాస్తవాలను వక్రీకరిస్తూ ప్రసంగిస్తున్నారు. అధికారంలో ఉన్న ఐదేళ్లూ కేవలం రెండు కిలోమీటర్ల పనులు చేశారంటే వారి చిత్తశుద్ధి ఏపాటిదో అవగతమవుతోంది. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రెండో సొరంగం పూర్తి చేసి నీళ్లిస్తామంటూ ఆయన చేస్తున్న ప్రకటనలపై జిల్లా వాసులు మండిపడుతున్నారు. అసలు వాస్తవాలు తెలుసుకో లోకేశా..అంటున్నారు.



వెలిగొండ టన్నెల్



ప్రకాశం, కడప, నెల్లూరు జిల్లాల్లో
4.50 లక్షల ఎకరాలకు సాగునీరు
15.25 లక్షల మందికి తాగునీరు

వెలిగొండపై వాస్తవాలు తెలుసుకో లోకేశం
- నాడు నిధులు మింగేసి.. ప్రాజెక్టును గాలికొదిలేసి
- టీడీపీ హయాంలో కేవలం రెండు కిలోమీటర్ల పనులు
- అధికారంలోకి వస్తే నీళ్లు ఇస్తామంటూ ఆర్భాట ప్రకటనలు
- వైఎస్సార్ సీపీ హయాంలోనే జీవనాడికి జవసత్వాలు
- ఇప్పటికే మొదటి సొరంగం పూర్తి. శరవేగంగా రెండో సొరంగం పనులు
- వడివడిగా పునరావాస కార్యక్రమాలు
- సెప్టెంబర్ నాటికి పూర్తి చేసే దిశగా అడుగులు

మార్కాపురం: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 2002లో మార్కాపురం నియోజకవర్గానికి వచ్చారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు వెలిగొండ ప్రాజెక్టు అంశాన్ని ఆయన దృష్టికి తెచ్చారు. తాను అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రాజెక్టుకు నిధులు కేటాయించి పనులు పూర్తయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన వెంటనే క్షామపీడిత ప్రాంతాలకు మేలు చేయాలన్న మహోన్నత లక్ష్యంతో వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణ పనులకు పునాది రాయి వేశారు. అంతేకాదు వేల కోట్లు కేటాయించి వేగంగా పనులు చేపట్టారు. ప్రస్తుత ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి తండ్రి అప్పటి ఎమ్మెల్యే కేపీ కొండారెడ్డి ప్రాజెక్టు నిర్మాణం కోసం వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని పలు దఫాలు కలిసి నిధులు కేటాయించేలా చూశారు.

ప్రాజెక్టు లక్ష్యం ఇలా...

శ్రీశైలం ప్రాజెక్టులోని 43.58 టీఎంసీల కృష్ణా నీటిని శ్రీశైలం వద్ద ఉన్న కొల్లం వాగు నుంచి 2 టన్నెల్స్ ద్వారా ప్రకాశం, కడప, నెల్లూరు జిల్లాల్లోని 30 మండలాలకు అందించేలా వెలిగొండ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. దీని ద్వారా 4.47 లక్షల 300 ఎకరాలకు సాగునీరు, 15.25 మంది లక్షల మందికి తాగునీరు అందనుంది. ఇప్పటికే గొట్టిపడియ, సుంకేసుల, కాకర్ల డ్యాంలు పూర్తి కాగా, దోర్నాల మండలం కొత్తూరు వద్ద రెండు టన్నెల్ పనులు పూర్తికానున్నాయి. మొదటి టన్నెల్ పనులు పూర్తి చేయగా, రెండో టన్నెల్ పనులు కూడా వేగంగా చేస్తున్నారు.

వైఎస్సార్ హయాంలో...

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత వెలిగొండ ప్రాజెక్టు రూపురేఖలు మారిపోయాయి. ఒక సొరంగం నిర్మించి 3001 క్యూసెక్కుల నీటిని తరలించాలన్న డీపీఆర్‌ను మార్పు చేశారు. రెండు సొరంగాలు నిర్మించి 11,583 క్యూసెక్కుల నీళ్ల తరలించేలా కొత్త డీపీఆర్‌ను తయారు చేయించారు. జలయజ్ఞంలో భాగంగా రూ.3,581 కోట్లు కేటాయించి నల్లమల సాగర్‌తోపాటు సొరంగాల్లో సింహభాగం పనులు పూర్తి చేయించారు. నల్లమల సాగర్‌కు సొరంగాలను అనుసంధానం చేసేలా 23 కిలోమీటర్ల మేర ఫీడర్ పనులు చేయించారు. అలాగే తీగలేరు కెనాల్, గొట్టిపడియ కెనాల్, తూర్పు కాలువ పనులు చేపట్టారు. శ్రీశైలంలో వరద వచ్చే 43 రోజుల్లో నల్లమల సాగర్ వద్ద 53.85 టీఎంసీల నీటిని నింపాలని యోచించారు.

టీడీపీ హయాంలో...

1995 నుంచి 2004 వరకూ తెలుగుదేశం ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు ఖర్చు చేసింది కేవలం రూ.10 లక్షలు మాత్రమే. 1996 మార్చిలో గొట్టిపడియ వద్ద ప్రాజెక్టు పనులకు చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభా ఏర్పాట్ల కోసం మాత్రమే రూ.10 లక్షలు వెచ్చించారు. ఆ తర్వాత 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు వెలిగొండ ప్రాజెక్టు పనులను గాలికొదిలేశారు. అధికారంలో ఉన్న ఐదేళ్లలో పనుల్లో పురోగతి లేదు. అంచనాలు పెంచేశారు. కాంట్రాక్టర్లకు అప్పనంగా రూ.650 కోట్లు దోచిపెట్టారు. 2017 నాటికి పనులు పూర్తి చేస్తామని ప్రకటించారు. ఆ తర్వాత 2018, 2019లో పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ముంపు గ్రామాల నిర్వాసితుల సమస్యలపై సైతం దృష్టి సారించలేదు. 2014 నుంచి 2019 మధ్య 1వ టన్నెల్‌కు సంబంధించి కేవలం 2 కి.మీ మాత్రమే పనులు జరిగాయంటే ప్రాజెక్టు నిర్మాణంపై చంద్రబాబుకు ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతుంది.

జగన్ హయాంలో...

వైఎస్సార్ ఆశయాన్ని నెరవేర్చే దిశగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అడుగులు వేశారు. పోలవరం తర్వాత అత్యంత ప్రాధాన్యత ప్రాజెక్టుల జాబితాలో దీనిని చేర్చారు. రివర్స్ టెండరింగ్ ద్వారా గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతికి అడ్డుకట్ట వేసి రూ.61.76 కోట్లు ఆదా చేశారు. పనులను ఆయన స్వయంగా పర్యవేక్షిస్తూ వస్తున్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి సొరంగంలో మిగిలిపోయిన 2.883 కి.మీ పనులను 2021 జనవరి నాటికి పూర్తి చేయించారు. అలాగే నల్లమల సాగర్‌కు నీటిని విడుదల చేసే హెడ్ రెగ్యులేటర్ పనులు సైతం పూర్తయ్యేలా దృష్టిసారించారు. రెండో సొరంగం పనులు వేగవంతం చేశారు. 2022-23లో 5.52 కి.మీ మేర సొరంగం తవ్వారు. మిగిలిన 1.889 కి.మీ పనులను సెప్టెంబరు నెలాఖరులోపు పూర్తిచేసి అక్టోబరులో నీళ్లివ్వాలని సీఎం ఆదేశించారు.



వెలిగొండపై సమీక్ష నిర్వహిస్తున్న సీఎం వైఎస్ జగన్ (ఫైల్)



సుంకేసుల వద్ద పనులు ప్రారంభిస్తున్న అప్పటి సీఎం వైఎస్సార్, ఎమ్మెల్యే కొండారెడ్డి (ఫైల్)

వేగంగా పునరావాస పనులు...

ప్రాజెక్టు నిర్మాణం కారణంగా నిర్వాసితులను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందుకు సంబంధించిన పనులు వేగవంతం చేసింది. ముంపు గ్రామాలైన కలనూతల వారికి ఇడుపూరు-1, 2లో, గుండంచెర్ల నిర్వాసితులకు తోకపల్లి వద్ద, సుంకేసుల గ్రామస్తులకు గోగులదిన్నె వద్ద, గొట్టిపడియ, అక్కచెరువు గ్రామస్తులకు వేములకోట వద్ద, సాయిరాంనగర్, రామలింగేశ్వరపురం వాసులకు ఒందుట్ల వద్ద పునరావాస పనులు జరుగుతున్నాయి. ఇదే సమయంలో గొట్టిపడియ వద్ద వెలిగొండ నీటిని మార్కాపురం, గిద్దలూరు, యర్రగొండపాలెం, కనిగిరి నియోజకవర్గాల్లో ప్రజలకు అందించేందుకు ఇన్‌టెక్ ట్యాంక్ పనులను వేగంగా చేస్తున్నారు. పునరావాస పనుల కోసం ప్రభుత్వం రూ.868.27 కోట్లు కేటాయించింది. ప్రాజెక్టుకు మొత్తం సుమారు 24 వేల ఎకరాలు సేకరించాల్సి ఉండగా సుమారు 21 వేల ఎకరాలు సేకరించింది. మిగిలిన భూమిని సేకరిస్తున్నారు.

త్వరలో వెలిగొండ జలాలు...



టీడీపీ హయాంలో వెలిగొండ నిధులను పార్టీ నేతలు ఏటీఎంలాగా వాడుకున్నారు. ప్రాజెక్టు నిర్మాణంపై వారికి చిత్తశుద్ధి లేదు. వెలిగొండ ప్రాజెక్టు విషయమై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టి సమీక్షలు చేస్తున్నారు. పోలవరం ప్రాజెక్టుతో సమానంగా వెలిగొండకు ప్రాధాన్యత ఇస్తున్నారు. నేను, సహచర ఎమ్మెల్యేలు, మంత్రులం వెలిగొండ ప్రాజెక్టు కోసం సీఎం వైఎస్ జగన్‌ను కలిశాం. త్వరగా పూర్తి చేస్తామని చెప్పారు. తండ్రి వైఎస్సార్ హయాంలో ప్రాజెక్టు పనులు ప్రారంభించగా తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాజెక్టును ప్రారంభిస్తారు. ఇందులో ఎటువంటి సందేహం లేదు. వెలిగొండ జలాలతో ఈ ప్రాంతం మరో కోనసీమలాగా పచ్చని పైర్లతో, పాడిపంటలతో కళకళలాడుతుంది. అప్పుడు కరువు మాటే వినిపించదు.

– కేపీ నాగార్జునరెడ్డి, ఎమ్మెల్యే మార్కాపురం

మహిళల రక్షణకు కట్టుబడిన ప్రభుత్వం

● హోం మంత్రి తానేటి వనిత

ఒంగోలు టౌన్: మహిళలు, చిన్నారులు, యువత రక్షణ విషయంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత స్పష్టం చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎంపీ నిధులతో నూతనంగా నిర్మించిన పోలీసు గెస్ట్ హౌస్‌ను శుక్రవారం ఆమె ప్రారంభించారు. అత్యంత ఆధునిక సౌకర్యాలతో నిర్మించిన గెస్ట్‌హౌస్‌ను పరిశీలించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మహిళల భద్రతే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి జిల్లాలోను దిశ పోలీసు స్టేషన్లు ఏర్పాటు చేసిందని తెలిపారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా కోటి 60 లక్షల మంది దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని రిజిస్టర్ చేసుకున్నారని చెప్పారు. పోలీసు సేవలను ప్రజలకు మరింత చేరువ చేస్తూ ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాన్ని, జీరో ఎఫ్ఐఆర్ పద్ధతిని జగనన్న ప్రభుత్వం తీసుకొని వచ్చిందని చెప్పారు.

వలంటీర్లపై కక్షకట్టి మాట్లాడుతున్న పవన్ కళ్యాణ్

కరోనా లాంటి కష్ట కాలంలో కూడా ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవలు అందజేసిన వలంటీర్లపై కక్ష కట్టిన పవన్ కళ్యాణ్ నోటికొచ్చినట్లు విమర్శలు చేయడం మంచి పద్ధతికాదని హోం మంత్రి అన్నారు. వలంటీర్లలో 80 శాతం మహిళలే పనిచేస్తున్నారని, అలాంటి మహిళలను కించపరిచేలా మాట్లాడటంపై మండిపడ్డారు. వలంటీర్లు అమ్మాయిలను సరఫరా చేస్తున్నారని తీవ్రమైన వ్యాఖ్యలు చేసిన పవన్ కళ్యాణ్‌పై ప్రభుత్వం పరువు నష్టం దావా వేస్తుందని తెలిపారు.



పోలీస్ గెస్ట్‌హౌస్‌ని ప్రారంభిస్తున్న మంత్రులు తానేటి వనిత, ఆదిమూలపు సురేష్, జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, కలెక్టర్ దినేష్‌కుమార్, ఐజీ జి.పాల్‌రాజు, ఎస్పీ మలికాగర్గ్

గిరిజన యువకుడికి అండగా...

గిరిజన యువకుడైన మోటా నవీన్ మీద భౌతికంగా దాడి చేయడమే కాకుండా హేయమైన రీతిలో అతడి మీద మూత్రం పోయడం చాలా దారుణం అని ఆవేదన వ్యక్తం చేశారు. ఘటన వెలుగులోకి వచ్చిన వెంటనే పోలీసులు స్పందించి తగిన చర్యలు తీసుకుంటున్నారన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, తగిన రక్షణ కల్పిస్తారని తెలిపారు. నవీన్ మీద ఉన్న పాత కేసుల విషయంలో చట్టం తనపని తాను చేస్తుందన్నారు. ఈ కేసులో ఇప్పటికే ఆరుగురిని అదుపులోకి తీసుకున్నామని, పరారీలో ఉన్న ప్రధాన నిందితుడైన రామాంజనేయ చౌదరితో పాటు మిగిలిన ఇద్దరిని త్వరలోనే అరెస్టు చేస్తామన్నారు. సాంకేతిక సమస్యలను అధిగమించడం ద్వారా త్వరలోనే పోలీసు ఉద్యోగాల నియామకాల ప్రక్రియ త్వరలోనే పూర్తి చేస్తామని తెలిపారు. ఎస్పీ మలికాగర్గ్ మాట్లాడుతూ ఎంపీ మాగుంట సహకారంతో, ఆయన ఇచ్చిన నిధులతో గెస్ట్ హౌస్ సకాలంలో పూర్తయిందని, అందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ మాగుంట శ్రీనివాసులు, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, గుంటూరు రేంజి ఐజీ జి.పాల్ రాజ్, కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, ఎమ్మెల్సీ శ్రీకాంత్, మేయర్ గంగాడ సుజాత, ట్రైనీ ఐపీఎస్ అంకితా సురాన, ఏఎస్పీలు కె.నాగేశ్వరరావు, శ్రీధర్‌రావు, అశోక్ బాబు, డీఎస్పీలు పాల్గొన్నారు.

నేతన్న నేస్తంతో నేత కుటుంబాల్లో సంతోషం

- ఇచ్చిన మాట మేరకు పథకాల అమలు
- ప్రతి కుటుంబానికి ఏడాదికి రూ.24 వేలు ఆర్థిక సహాయం
- మంత్రి ఆదిమూలపు సురేష్

ఒంగోలు అర్బన్: వైఎస్ఆర్ నేతన్న నేస్తం పథకం లక్ష్యం చేనేత కుటుంబాల్లో సంతోషం చూడటమేనని అందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తుందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. ఈ పథకం కింద ఐదో విడతలో భాగంగా అర్హులైన వారి బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ చేసే కార్యక్రమాన్ని శుక్రవారం తిరుపతి జిల్లా వెంకటగిరిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాల్గొన్నారు. దీనికి అనుబంధంగా జిల్లాలో ప్రకాశం భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దీనిలో కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ ఆళ్ల రవీంద్రా రెడ్డి, టైలర్స్ డెవలప్‌మెంట్ కో ఆపరేటివ్ చైర్మన్ షేక్ సుభానీబీ, నగర మేయర్ గంగాడ సుజాత, ఇతర అధికారులు పాల్గొని లబ్ధిదారులకు చెక్కు అందజేశారు. దీనిలో మంత్రి సురేష్ మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన వెంటనే సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి అమలు చేస్తున్నారన్నారు. పార్టీలకు అతీతంగా అన్నీ పథకాలు అర్హులందరికీ చేరుతున్నాయన్నారు. కరోనా కష్టకాలంలో సైతం సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత వైఎస్ జగన్‌దని అన్నారు. నేతన్న నేస్తం పథకంలో భాగంగా సొంత మగ్గం ఉన్న ప్రతి చేనేత కుటుంబానికి ఏడాదికి రూ.24 వేల ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఐదో విడతలో భాగంగా 2023-24 ఆర్థిక సంవత్సరానికి జిల్లాలో 769 కుటుంబాలకు రూ.1.85 కోట్లు ఆర్థిక ప్రయోజనం కల్పించినట్లు తెలిపారు. అన్నీ వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. దీనిలో చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు ఉదయ్‌కుమార్, అభివృద్ధి అధికారి వెంకటేశ్వరరావు, సహాయ అభివృద్ధి అధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



చేనేతలకు చెక్కు అందజేస్తున్న మంత్రి సురేష్, కలెక్టర్, జెడ్పీ చైర్‌పర్సన్, ఎంపీ

యువగళానికి సీనియర్లు డుమ్మా..

మార్కాపురం/పొదిలి/కొనకనమిట్ల/తర్లుపాడు: ఒక వైపు ఆశించినంతగా జనం రాకపోవడం..మరో వైపు పార్టీ సీనియర్ నేతలు అసంతృప్తితో నారా లోకేష్ పాదయాత్రకు డుమ్మా కొట్టడం చర్చనీయాంశమైంది. యువగళం పాదయాత్ర శుక్రవారం సాయంత్రం మార్కాపురం నియోజకవర్గంలో అడుగుపెట్టింది. కొనకనమిట్ల మండలం పెద్దారికట్లలో లోకేష్ పాదయాత్ర చేశారు. మార్కాపురం పట్టణానికి చెందిన టీడీపీ సీనియర్ నేత శాసనాల వీరబ్రహ్మం, పొదిలికి చెందిన శ్రావణి వెంకటేశ్వర్లు, ఇంకా పలువురు నాయకులు పాదయాత్రలో కనిపించలేదు. వీరి గైర్హాజరు సమాచారం అందుకున్న నారా లోకేష్, పరిస్థితిని చక్కదిద్దాలని జిల్లా నాయకత్వాన్ని ఆదేశించారు. దీంతో దామచర్ల సత్య, జిల్లా ఇన్‌చార్జ్ బీసీ జనార్దన్‌రెడ్డి శుక్రవారం రాత్రి పొదిలిలోని శ్రావణి వెంకటేశ్వర్లు ఇంటికి వెళ్లారు. ఆయనతో మాట్లాడారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ తనను ఏవిధంగా ఇబ్బందులు పెట్టింది వివరించినట్లు సమాచారం. శనివారం జరిగే సభకు హాజరు కావాలని వారు కోరారని, అయితే తాను రావటం లేదని ఆయన ఖరాఖండిగా చెప్పినట్లుగా తెలిసింది. లోకేష్ పర్యటనలో పట్టణానికి చెందిన బలమైన టీడీపీ నేతతో పాటు ఆయన అనుచరవర్గం రాకపోవటంతో టీడీపీలో ఉన్న విభేదాలు బహిర్గతమయ్యాయి.



చినారికట్లలో స్టేజీ వద్ద నిరాశగా మహిళలు

సెల్ఫీలు..షేక్ హ్యాండ్లు:

పెదారికట్ల నుంచి పోతవరం వరకు సాగిన పాదయాత్రకు ఆశించినంత స్పందన రాకపోవడంతో కార్యకర్తలు నిరుత్సాహపడ్డారు. లోకేష్ ఎక్కడా ఒక్క మాట కూడా మాట్లాడకపోవటంతో వచ్చిన వారు ఉసూరుమంటూ వెనుతిరిగారు. కొన్నిచోట్ల లోకేష్ అడిగి మరీ సెల్ఫీలు తీయించుకున్నారు. షేక్ హ్యాండ్లు ఇస్తూ పర్యటన సాగింది. చినారికట్లలో స్థానికులు వేదిక ఏర్పాటు చేసి, అక్కడ మాట్లాడతారని హడావుడి చేసినా, లోకేష్ అక్కడ అభివాదంతోనే సరిపెట్టడంతో, నిర్వాహకులు ఉసూరుమన్నారు.

ట్రాఫిక్ జాంతో ప్రజల ఇబ్బందులు:

పెదారికట్ల నుంచి యువగళం పాదయాత్ర ఆరంభం నుంచి సభ్యులు అత్యుత్సాహంతో రోడ్డును బ్లాక్ చేయటంతో రోడ్డుపై వాహనాలు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అయితే ఇవేమీ పట్టని నేతలు, కార్యకర్తలు లోకేష్ ముందుకు కదిలే వరకూ రోడ్డుకు అడ్డంగా ఉన్నారు. దీంతో దూర ప్రాంతాలకు పోయే ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. మరో వైపు కనిగిరి, గిద్దలూరు, దొనకొండ, ఒంగోలు వైపు రాక పోకలు సాగించే జంక్షన్ కావటంతో మరింత రద్దీగా మారింది. పాదయాత్రలో మందుబాబుల హడావుడి ఎక్కువైపోవడంతో నాయకులు ఇబ్బందిపడ్డారు. ఇదిలా ఉండగా చిన్నారికట్లలో పాదయాత్రకు ఎదురుగా కొంతమంది వాహనాల మీద పోతూ జై జగన్ అంటూ నినాదాలు చేయడం కొసమెరుపు. పాదయాత్రలో జనం ఊహించినదానికంటే తక్కువగా ఉండటంతో శనివారం సాయంత్రం పొదిలిలో జరిగే సభకు జనాలు వస్తారా రారా అన్న ఆందోళన పార్టీ నాయకుల్లో ఏర్పడింది. దీంతో ఇద్దరు ఎమ్మెల్యేలు జనసమీకరణపై దృష్టిపెట్టారు. పొదిలిలో జరిగే సభకు మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాల నుంచి ఆటోలు, కార్లు, గ్రామ గ్రామానికి పంపాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని ఎమ్మెల్యేలందరూ పాదయాత్రకు ముందుండి లోకేష్ వచ్చే ముందు రోడ్లకు ఇరువైపులా మహిళలు ఉండేలా చూసినా ఆశించిన స్థాయిలో జనాలు రాకపోవడంతో నిరుత్సాహపడ్డారు. పాదయాత్ర ప్రారంభమైన పెద్దారికట్ల గ్రామం దాటగానే వివిధ గ్రామాల నుంచి వచ్చిన వారు తాము తెచ్చుకున్న వాహనాల్లో వెళ్లిపోతుండటం గమనించిన పార్టీ నాయకులు వారిని ఆపే ప్రయత్నం చేశారు. లోకేష్ కంభాలపాడు మీదుగా పోతవరం నైట్‌క్యాంపునకు చేరుకున్నారు.

తాగునీటికి సాగర్ జలాలు విడుదల

- జిల్లా ప్రజల తాగునీటి అవసరాల కోసం 5 టీఎంసీల విడుదలకు అంగీకారం
- సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లిన మంత్రి ఆదిమూలపు సురేష్

ఒంగోలు సబర్బన్: జిల్లా ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు నాగార్జున సాగర్ నుంచి నీటిని శుక్రవారం విడుదల చేశారు. సాగర్ కుడికాలువ నుంచి 1000 క్యూసెక్కుల చొప్పున మొత్తం 5 టీఎంసీలు విడుదల చేయాలని సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు అధికారులతో చర్చించి మరీ విడుదల చేయించారు. ఈ మేరకు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ ఈ నెల 17వ తేదీన ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. జిల్లాలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల్లోని తాగునీరు అడుగంటాయని, దీంతో సాగర్ నుంచి నీరు విడుదల చేయకపోతే తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడతారని మంచినీటి తీవ్రతను సీఎం దృష్టికి మంత్రి ఆదిమూలపు సురేష్ తీసుకెళ్లారు. దీంతో సాగర్ నుంచి నీటిని విడుదల చేశారు. తొలుత సాగర్ నుంచి వచ్చే నీటితో పల్నాడు జిల్లాలోని బుగ్గవాగును నింపుతారు. ఆ తరువాత అక్కడ నుంచి జిల్లాలోని ఎస్ఎస్ ట్యాంకులకు, సీపీడబ్ల్యూఎస్ స్కీంలకు నింపుతారు.

అదనపు మోటార్లతో నీటిని నింపాలి:

సాగర్ నుంచి నీరు విడుదల చేసిన సందర్భంగా అదనపు మోటార్లు పెట్టి అయినా నీరు నింపుకోవాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లాలోని మంచినీటి సమస్యను సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లామని, ఆయన వెంటనే స్పందించి ఈ నెల 19న జరిగిన కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు సమావేశంలో తీర్మానించి సాగర్ నుంచి నీటిని విడుదల చేయించారన్నారు. జిల్లాలోని సీపీడబ్ల్యూఎస్ స్కీంల్లో నీరు డెడ్‌స్టోరేజీకి చేరుకున్నాయని వివరించామన్నారు. దీంతో సమస్యను అర్థం చేసుకున్న సీఎం వైఎస్ జగన్ వెనువెంటనే స్పందించి సాగర్ నీరు విడుదల చేసేలా అధికారులను ఆదేశించారన్నారు. తక్కువ సమయంలో ట్యాంకులను నింపుకోవాల్సి రావటంతో సంబంధిత అధికారులు బాధ్యతగా మెలిగి అదనపు మోటార్లు కేటాయించుకోవాలన్నారు.

క్లుప్తంగా

భార్యపై గొడ్డలితో భర్త దాడి



చికిత్స పొందుతున్న ఈశ్వరమ్మ

దర్శి: భార్యపై అనుమానంతో గొడ్డలితో భర్త దాడి చేసిన సంఘటన దర్శి మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. రేపూడి కోటేష్ బేల్దారి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. అతని భార్య ఈశ్వరమ్మ ముఠా కూలి పనులకు వెళ్తోంది. వీరికి ముగ్గురు సంతానం కాగా, కోటేష్ ప్రతిరోజూ మద్యం తాగి ఇంటికొచ్చి భార్యను అనుమానించడం, తిట్టడం, కొట్టడం చేస్తున్నాడు. శుక్రవారం ముగ్గురు కుమారులు ఇంట్లో ఉండగానే గొడవ పెట్టుకోవడంతో పెద్ద కుమారుడు తండ్రిని మందలించి పంపాడు. అనంతరం ఈశ్వరమ్మ మంచంపై పడుకుని ఉండగా కోటేష్ ఇంటికొచ్చి గొడ్డలితో తల, మొహం, ఎడమ కణితిపై నరకడంతో తీవ్ర రక్త స్రావమవగా, వెంటనే ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కోటేష్ కూడా తనపై కుటుంబ సభ్యులు దాడి చేసినట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చౌదరి ఎక్కడ..?

- టీడీపీ నేత అండతోనే అతడు బరితెగించినట్లు ప్రచారం

ఒంగోలు టౌన్: గిరిజన యువకుడు మోటా నవీన్‌పై అత్యంత క్రూరంగా దాడి చేసిన కేసులో ప్రధాన నిందితుడు మన్నెం రామాంజనేయులు చౌదరి ఇంకా పరారీలోనే ఉన్నాడు. ఈ కేసులో మొత్తం 9 మంది నిందితులు ఉండగా వారిలో ఆరుగురికి ఇప్పటికే పోలీసులు సంకెళ్లు వేశారు. మిగిలిన ముగ్గురిలో ఇద్దరిని కూడా అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ దురాగతంలో కీలక పాత్ర పోషించిన రామాంజనేయులు చౌదరి మాత్రం తప్పించుకొని తిరుగుతున్నాడు. అతడి కోసం రెండు ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేసిన పోలీసులు.. హైదరాబాద్, గుంటూరు తదితర ప్రాంతాల్లో ముమ్మరంగా గాలిస్తున్నా ఆచూకీ లభించక పోవడం చర్చనీయాంశంగా మారింది. వాస్తవానికి గత నెల 19న నవీన్‌పై దాడి చేసిన తర్వాత చౌదరి నగరంలోని శివారు ప్రాంతంలో ఓ చర్చి వెనక ఉన్నట్లు సమాచారం. అవివాహితుడైన చౌదరి వెంట ఓ మహిళ, పదేళ్ల పాప కూడా ఉన్నట్లు తెలుస్తోంది. దాడి చేసిన తర్వాత నవీన్ కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి తన మీద కేసు పెడితే చంపేస్తానని, తనకు రాజకీయ అండదండలు దండిగా ఉన్నాయని బెదిరించినట్లు స్థానికంగా చెప్పుకుంటున్నారు. గతేడాది కూడా నవీన్‌పై దాడి చేసి తల పగులగొట్టాడని బాధితుడు పోలీసులు, ఎస్టీ కమీషన్ సభ్యుడు వడితే శంకర్ నాయక్ ఎదుట చెప్పాడు. అప్పుడు కూడా చౌదరి రాజకీయ, సామాజిక అండ చూసి భయపడిన నవీన్ కేసు పెట్టలేదని తెలుస్తోంది. తాజాగా గత నెల దాడి జరిగినప్పుడు కూడా నవీన్ పోలీసులకు అసలు ఏం జరిగిందన్నది చెప్పక పోవడాన్ని కొందరు గుర్తు చేస్తున్నారు. అంతేకాకుండా చికిత్స పూర్తి కాకుండానే రిమ్స్ నుంచి వెళ్లిపోయాడు. ఇది మామూలు దాడిగానే పోలీసులు భావించారు. వీడియో బయట పడిన తర్వాత కానీ అసలు నిజం వెల్లడి కాలేదు. ఒంగోలు నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీకి చెందిన ఒక కీలక నాయకుడితో సన్నిహిత సంబంధాలు కలిగిన రామాంజనేయ చౌదరి అతడి సూచనలు, సలహాల మేరకే ఘటన జరిగిన నెల రోజుల తర్వాత వీడియో బయటకు వచ్చేలా చేసినట్లు తెలుస్తోంది. సదరు నాయకుడి సంరక్షణలోనే తలదాచుకున్న రామాంజనేయులు చౌదరి.. పోలీసులకు చిక్కకుండా వారిని మూడు చెరువుల నీళ్లు తాగిస్తున్నాడని నగరంలో ప్రచారం జరుగుతోంది.



గొట్టిపడియ వద్ద నిర్మాణంలో వాటర్ గ్రిడ్



మార్కాపురంలో వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం



పొదిలి సామాజిక వైద్యశాల నూతన భవనం



పొదిలి-దర్శి రోడ్డులో పైపులైన్ కోసం సిద్ధంగా సామగ్రి



కంభాలపాడు ఆర్బీకే భవనం

పురంపై సంక్షేమ శరం!

మార్కాపురం నియోజకవర్గ అభివృద్ధిపై సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక దృష్టి

- నాలుగేళ్ల పాలనలో రూ.1300 కోట్ల నిధుల కేటాయింపు
- రూ.475 కోట్లతో మెడికల్ కాలేజీ నిర్మాణం
- రూ.50 కోట్లతో పొదిలికి సాగర్ పైప్‌లైన్ పనులు ప్రారంభం
- రూ.600 కోట్లతో ముమ్మరంగా వాటర్ గ్రిడ్ పనులు
- 16 వేల మందికి ఇళ్ల పట్టాలు మంజూరు



పొదిలి పిచ్చిరెడ్డితోట వద్ద జగనన్న లే అవుట్లో నిర్మాణంలో ఉన్న ఇళ్లు

మార్కాపురం: 'మా పార్టీకి మీరు ఓట్లేయలేదు.. పనులు కావాలంటే ఎలా?' చంద్రబాబు అధికారం వెలగబెట్టిన సమయంలో నేరుగా బహిరంగ సభల్లో చేసిన వ్యాఖ్యలివి! అధికారంలో ఉన్నపుడు ఒకలా.. లేనపుడు మరోలా మాట్లాడటం ఆయనకే చెల్లింది. సీఎం హోదాలో మార్కాపురం పర్యటనకు వచ్చిన చంద్రబాబు, మంత్రిగా వచ్చిన లోకేష్.. పశ్చిమ ప్రకాశం ప్రధాన కేంద్రమైన మార్కాపురానికి వరాలిస్తారని భావించిన ప్రజలకు నిరాశే మిగిలింది. ఈ తరుణంలో ప్రజా సంకల్ప పాదయాత్రలో భాగంగా మార్కాపురం నియోజకవర్గ సమస్యలు తెలుసుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కాగానే సంక్షేమ శరాలు సంధించారు. గడిచిన నాలుగేళ్లలో రూ.1300 కోట్లకు పైగా నిధులను కేటాయించి మార్కాపురం అభివృద్ధిపై సీఎం వైఎస్ జగన్ తన చిత్తశుద్ధిని చాటుకున్నారు.

పశ్చిమ ప్రకాశంలో మార్కాపురం నియోజకవర్గ ప్రగతిని పరిశీలిస్తే..

- ప్రజల చిరకాల కోరిక నెరవేరుస్తూ మార్కాపురంలో రూ.475 కోట్లతో మెడికల్ కాలేజీ నిర్మిస్తున్నారు.
- టీడీపీ ప్రభుత్వంలో హామీలకే పరిమితమైన గొట్టిపడియ వాటర్ గ్రిడ్‌కు రూ.600 కోట్లు కేటాయించారు.
- మార్కాపురం పట్టణంలో సాగర్ జలాల సరఫరాకు రూ.22 కోట్లతో పనులు సాగుతున్నాయి.
- మార్కాపురంలో రూ.2 కోట్లతో షాదీఖానా నిర్మాణ దశలో ఉంది.
- మార్కాపురం టౌన్, నియోజకవర్గంలో రోడ్లు, కాల్వలు, 66 గ్రామ/వార్డు సచివాలయాలు, 67 ఆర్‌బీకేలు, హెల్త్ క్లినిక్‌లు, ఇంటింటికీ కుళాయిల కోసం రూ.265 కోట్లు మంజూరు.
- మార్కాపురంలో బీసీ భవన్, అంబేడ్కర్ భవన్ నిర్మాణానికి రూ.50 లక్షల చొప్పున కేటాయింపు.
- మార్కాపురం నియోజకవర్గంలో వివిధ గ్రామాల్లో సీసీ రోడ్లకు రూ.220 కోట్లు విడుదల.
- అమృత్ పథకం కింద పొదిలికి రూ.7.50 కోట్లు, మార్కాపురానికి రూ.3 కోట్లు మంజూరు.
- అమృత్ 2.0 కింద మార్కాపురానికి ఫేజ్–2లో రూ.50 కోట్లు, పొదిలికి రూ.60 కోట్లు కేటాయింపు.
- మార్కాపురం నియోజకవర్గంలో 16 వేల మంది ప్రజలకు ఇళ్ల పట్టాలు అందజేశారు.
- మార్కాపురంలో 7 వేలు, పొదిలిలో 2 వేల మందికి గృహాలు మంజూరు కాగా నిర్మాణ దశలో ఉన్నాయి.

పొదిలి అభివృద్ధికి నిధుల వరద

పొదిలి: టీడీపీ జమానాలో పొదిలి అభివృద్ధిపై లేశమంతైనా దృష్టి సారించలేదు. ఫలితంగా ఇక్కడి ప్రజలు ఎదుర్కొన్న కష్టాలు అన్నీఇన్నీ కావు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రజల చిరకాల కోరికలు నెరవేరుస్తూ నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

- పొదిలి పెద్ద, చిన్న చెరువులకు దర్శి నుంచి సాగర్ పైప్‌లైన్ ఏర్పాటుకు సీఎం వైఎస్ జగన్ రూ.50 కోట్లు మంజూరు చేయగా ఇటీవల ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పనులను ప్రారంభించారు.
- పొదిలి మెయిన్ రోడ్డు అభివృద్ధి, డ్రెయినేజీల నిర్మాణానికి రూ.12 కోట్లు కేటాయించారు.
- పొదిలిలో 65 ఎకరాల్లో జగనన్న లేఅవుట్ వేసి 2,218 మందికి పట్టాలు పంపిణీ చేశారు. 1625 గృహాలు మంజూరు చేయగా వాటిలో 1115 ఇళ్లను జేఎస్ఆర్ సంస్థ శరవేగంగా నిర్మిస్తోంది. మిగిలినవి లబ్ధిదారులే నిర్మించుకుంటున్నారు.
- మనబడి నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి మొదటి దశలో రూ.35 కోట్లు, రెండో దశలో రూ.37 కోట్లు మంజూరయ్యాయి. 70 శాతం పనులు పూర్తయ్యాయి.
- జల్‌జీవన్ మిషన్ పథకంలో భాగంగా పొదిలి మండలానికి రూ.22 కోట్లు మంజూరు చేశారు. మొత్తం 34 పనులను చేపట్టనున్నారు.
- సామాజిక వైద్యశాల అభివృద్ధికి గత టీడీపీ ప్రభుత్వంలో రూ.60 లక్షలు కేటాయించి రంగులు వేయించారు. ఇందులో సగం నిధులను పచ్చ చొక్కాలు నొక్కేశాయనే ఆరోపణలున్నాయి. ప్రస్తుత ప్రభుత్వంలో సామాజిక వైద్యశాలకు రూ.60 కోట్లు మంజూరు చేశారు. ఆ నిధులతో సకల వసతులతో ఆస్పత్రి నిర్మించారు. ఎనిమిది మంది వైద్యులను నియమించారు.

'ఉగ్ర' ఉగ్రవాది.. లోకేష్ ఉన్మాది

- తరిమి తరిమి కొడతారనే ప్రజలు టీడీపీని ఓడించారు
- సీఎం జగన్‌ను విమర్శించే స్థాయి లోకేష్‌కు లేదు
- ఎమ్మెల్యేగా గెలవలేక.. ఉన్మాదిలా మాట్లాడుతున్నావ్..
- నేను మనీసూదన్ అయితే.. రెండెకరాల మీ 'బాబు' సంగతేంటి?
- నారా లోకేష్‌పై నిప్పులు చెరిగిన ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్
- రానున్న ఎన్నికల్లో దమ్ముంటే ఒంటరిగా బరిలోకి దిగాలని సవాల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్

కనిగిరి రూరల్: 'కనిగిరి మాజీ ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి ఒక ఉగ్రవాది. ఎమ్మెల్యేగా ఓటమిపాలై నోటికొచ్చినట్లు మాట్లాడుతున్న లోకేష్ ఒక ఉన్మాది' అని కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ విమర్శించారు. దొంగలే దొంగా దొంగా అన్నట్లుగా ఉగ్ర, లోకేష్ వైఖరి ఉందని ఎద్దేవా చేశారు. పాదయాత్రలో భాగంగా కనిగిరి సభలో లోకేష్ చేసిన ఆరోపణలపై ఎమ్మెల్యే బుర్రా ఘాటుగా స్పందించారు. స్థానిక వైఎస్సార్ భవన్‌లో పార్టీ నేతలతో కలిసి శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. 'ఎమ్మెల్యేగా కూడా గెలవలేని నువ్వు ఉన్మాదిలా మాట్లాడుతున్నావ్. ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ చదివే నీకు.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే స్థాయి, అర్హత లేద'ని మండిపడ్డారు. 'నీ వాకింగ్ యాత్రకు రోజుకు కోటి ఖర్చు పెట్టి జనసమీకరణ చేస్తున్నావ్.. ఆ డబ్బేమైనా నీ తండ్రి చంద్రబాబు రెండెకరాల్లో వ్యవసాయం చేసి సంపాదించాడా' అని నిలదీశారు. పోలవరం, రాజధాని నిర్మాణాల్లో రూ.వేల కోట్ల అవినీతికి పాల్పడింది, సీఆర్‌డీఏ పరిధిలో దళితుల భూముల లాక్కున్నది మీరు కాదా అని ప్రశ్నించారు. దళితులు, బీసీలు, మైనార్టీల గురించి లోకేష్ మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందన్నారు. అవినీతిలో పీజీ చేసిన ఘనత చంద్రాబాబుదేనని ఎద్దేవా చేశారు. ''ముందు నువ్వు ఎమ్మెల్యేగా గెలువు. నీకు నీ 'బాబు'కు దమ్ముంటే వచ్చే ఎన్నికల్లో సింగిల్‌గా పోటీ చేయాలని'' ఎమ్మెల్యే బుర్రా సవాల్ విసిరారు.

ఉగ్ర అవినీతి చిట్టా ఇదిగో..

ఉగ్ర గురించి నారా లోకేష్ చెప్పింది నూరు శాతం వాస్తవమని, ఆయనను ఒకసారి ఎమ్మెల్యేను చేసినందుకే అరాచక పాలన సాగించి, ప్రజలను భయభ్రాంతులకు గురి చేశాడని ధ్వజమెత్తారు. ఉగ్ర పదవిలో ఉంటే వ్యాపారులతోపాటు అన్ని వర్గాల ప్రజలను తరిమి తరిమి కొడతాడనే రెండుసార్లు ఓడించారని చెప్పారు. 'అడవిలో ఆదర్శ పాఠశాల పేరుతో ఉగ్ర రూ.కోట్లు దండుకున్నాడు. లిక్కర్ సిండికేట్‌లో రూ.2 కోట్లు తీసుకుని వార్తల్లోకెక్కాడు. కంభం, పొదిలి రోడ్డులో అసైన్డ్ భూములను గుంటూరు, ఇతర ప్రాంతాల వారికి కట్టబెట్టి అక్రమసొమ్ము తిన్నాడు. కరోనా సమయంలో కనిగిరి ప్రజలు గుంటూరులోని అమరావతి ఆస్పత్రికి వెళ్తే ఒక్కొక్కరికి రూ.15 లక్షల బిల్లులు వేసి నిలువునా దోచుకున్నాడు. ఆరోగ్య శ్రీలో భారీ కుంభకోణంపై ఏసీబీ విచారణ చేస్తారని తెలిసి ఒకరి కాళ్లు పట్టుకున్నాడు. పామూరు మండలంలో కోట్ల రూపాయలు అవినీతికి పాల్పడి, వేణుగోపాల స్వామి నిధులు దోచుకున్నాడు. నీరు–చెట్టు పథకంలో కోట్లు కొల్లగొట్టాడు' అని ఉగ్ర అవినీతి చిట్టాను ఎమ్మెల్యే బుర్రా వివరించారు. నర్రమారెళ్లలో 68 ఎకరాల ప్రభుత్వ భూమిని టీడీపీ నేత గుంటుపల్లి శ్రీనివాసులు ఆక్రమిస్తే దాన్ని పేదలకు, ఎస్సీలకు పంచాలని కలెక్టర్‌కు అర్జీ పెట్టించామని తెలిపారు.

కనిగిరిలో విజయం మాదే..

'నేను మనీసూదన్‌నే.. కష్టపడి పనిచేసి సంపాదించిన సొమ్ములో కొంత ప్రజా సేవకు ఖర్చు చేస్తున్నా. గడిచిన ఐదేళ్లుగా అనేక గ్రామాల్లో ప్రజలకు తాగునీరందించి, సేవా కార్యక్రమాలు నిర్వహించా. ప్రజల ఆశీస్సులతో ఎమ్మెల్యేగా గెలిచాను' అని లోకేష్ వ్యాఖ్యలను తిప్పికొట్టారు. అవినీతి, కుంభకోణాలకు లోకేష్, ఉగ్ర కేరాఫ్‌గా అని, మిమ్మల్ని గెలిపిస్తే తరిమికొడతారని బహిరంగంగా ప్రజలకు తెలియజేసినందుకు థ్యాంక్స్ అని ఎద్దేవా చేశారు. టీడీపీ నేతలు ఎన్ని కుట్రలు చేసినా.. రానున్న ఎన్నికల్లో కనిగిరిలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరేయడం ఖాయమన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, పార్టీ పట్టణ మండల అధ్యక్షుడు రంగనాయకుల రెడ్డి, సంగు సుబ్బారెడ్డి, ఎంపీపీలు అత్యాల జఖన్య, రామన తిరుపతిరెడ్డి, మూడమంచు వెంకటేశ్వర్లు, గంగసాని హుస్సేన్‌రెడ్డి, సీహెచ్ సాల్మన్, బైరెడ్డి తిరుపతిరెడ్డి, డాక్టర్ పెరుగు మురళీకృష్ణ, బలరాంరెడ్డి, భవనం కృష్ణారెడ్డి, కాకర్ల వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీ జిలానీ, గురు ప్రసాద్, వేల్పుల వెంకటేశ్వర్లు, పిల్లి లక్ష్మీనారాయణ రెడ్డి, యక్కంటి శ్రీను, చెరుకూరి సతీష్ చౌదరి, జయరెడ్డి, భువనగిరి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

రైలులో ప్రయాణిస్తూ అనారోగ్యానికి గురైన చిన్నారి

- గిద్దలూరు రైల్వేస్టేషన్‌లో వైద్యం



చిన్నారికి వైద్యసేవలు అందిస్తున్న వైద్యులు

గిద్దలూరు రూరల్: రైలులో ప్రయాణిస్తూ అనారోగ్యానికి గురైన ఓ చిన్నారికి గిద్దలూరు పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో ఆర్‌పీఎఫ్ సిబ్బంది వైద్య సహాయం అందించిన సంఘటన శుక్రవారం జరిగింది. వెస్ట్‌బెంగాల్ రాంపూర్‌కు చెందిన ఓ చిన్నారి పుట్టపర్తి నుంచి హౌరా వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణిస్తూ నంద్యాల రైల్వేస్టేషన్ దాటిన సమయంలో వాంతులు, విరేచనాలతో ఒక్కసారిగా అనారోగ్యానికి గురైంది. సమాచారం అందుకున్న గిద్దలూరు ఆర్‌పీఎఫ్ సిబ్బంది పట్టణంలోని రమేష్ చిన్నపిల్లల వైద్యశాల వైద్యుడిని పిలిపించి రైల్వేస్టేషన్‌లోనే రైలును పది నిమిషాలు ఆపి వైద్య సేవలు అందించారు. చిన్నారికి వైద్యసేవలు అందించడంలో కీలక పాత్ర పోషించిన ఆర్‌పీఎఫ్ సిబ్బంది జయరాములు, శేషయ్య, నాయబ్‌రసూల్‌కు చిన్నారి తల్లిదండ్రులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థి మృతి



నితిన్ శ్రీవర్మ మృతదేహం వద్ద రోదిస్తున్న తాత, బంధువులు



సంఘటన స్థలంలో వివరాలు తెలుసుకుంటున్న మంత్రి ఆదిమూలపు సురేష్

చీమకుర్తి: రోడ్డు ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థి మృతి చెందిన సంఘటన ఒంగోలు – కర్నూలు రోడ్డుపై సంతనూతలపాడు – పేర్నమిట్ట మధ్య శుక్రవారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఒంగోలు క్విస్ కాలేజీలో చదువుతున్న ఇంజినీరింగ్ విద్యార్థి గొట్టిముక్కల నితిన్ శ్రీవర్మ (21) అక్కడికక్కడే మృతి చెందాడు. మరో విద్యార్థి కళ్లగుంట సుధీర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్నేహితులైన నితిన్ శ్రీవర్మ, సుధీర్ ఇద్దరూ క్విస్ కాలేజీలో ఫైనలియర్ బీటెక్ చదువుతున్నారు. స్వగ్రామం సంతనూతలపాడు మండలం మన్నంవారిపాలెం నుంచి బైకుపై కాలేజీకి వచ్చి వెళ్తుంటారు. రోజూలాగే శుక్రవారం కూడా ఇద్దరూ సుధీర్ బైకుపై కాలేజీకి వెళ్తున్నారు. నితిన్ వెనుక కూర్చుని ఉండగా, పేర్నమిట్ట ఈనాడు ఆఫీస్ వద్దకు వచ్చేసరికి ఎదురుగా రోడ్డు పక్కన గ్రానైట్ రాళ్లను ఒంగోలు వైపు తీసుకెళ్తున్న టిప్పర్ నిలిపి ఉంది. టిప్పర్ వెనుక టైర్లకు సుధీర్ కాళ్లు తగిలి రోడ్డుకు కుడివైపు పడ్డారు. అదే సమయంలో పొద్దుటూరు నుంచి హద్దు రాళ్లను ఒంగోలు వైపు తీసుకెళ్తున్న ట్రాక్టర్ రోడ్డుపై పడిన నితిన్ శ్రీవర్మ తలపైకి ఎక్కడంతో తల నుజ్జునుజ్జయి అక్కడికక్కడే మృతి చెందాడు. సుధీర్‌కు కూడా తీవ్ర గాయాలవడంతో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. నితిన్ శ్రీ వర్మ తండ్రి క్విస్ కాలేజీ బస్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొడుకు మృతి చెందాడనే సమాచారం తెలియగానే నితిన్ తాత కోటమురాజు, తండ్రి సీతారామరాజు, తల్లి లక్ష్మి, కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహంపై పడి రోదించిన తీరు అక్కడివాళ్లను సైతం తీవ్ర ఆవేదనకు గురి చేసింది. క్విస్ కాలేజీ కరస్పాండెంట్ నిడమానూరి నాగేశ్వరరావు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఒంగోలు తాలూకా ఏఎస్సైలు షేక్ జిలాని, దయానందరావు సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. ట్రాక్టర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. గాయపడిన సుధీర్ ఫిర్యాదు మేరకు ఏఎస్సై జిలాని కేసు నమోదు చేశారు.

ప్రమాదాన్ని చూసి చలించిపోయిన మంత్రి సురేష్...

ఒంగోలు టౌన్: జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలో పోలీసు గెస్ట్‌హౌస్ ప్రారంభోత్సవానికి ఒంగోలు వెళ్తున్న పురపాలక శాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్నమిట్ట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదాన్ని చూసి కాన్వాయ్ ఆపి పరిశీలించారు. నడిరోడ్డుపై నెత్తుటి మడుగులో నిర్జీవంగా పడి ఉన్న యువకుడి మృతదేహాన్ని చూసి చలించిపోయారు. వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి మాట్లాడారు. పోలీసు అధికారులతో మాట్లాడి త్వరితగతిన మృతదేహాన్ని తరలించి పోస్టుమార్టం పూర్తి చేసి కుటుంబ సభ్యులకు అందజేయాలని ఆదేశించారు. ఎంతో ఉజ్వల భవిష్యత్తు ఉన్న యువకుడు రోడ్డు ప్రమాదంలో అర్ధంతరంగా తనువు చాలించడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు.



ఈ ఆహారం తింటే...

చినుకుల్లోనూ చింత ఉండదిక

నిన్న మొన్నటి దాకా చెమటలు పట్టించిన ఎండలు కాస్తా ఇప్పుడు మబ్బుల వెనక దాక్కుని, వానలు కురిపిస్తున్నాయి. వానలు ఆహ్లాదం గానే ఉంటాయి. అయితే సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే వ్యాధులను కూడా వెంట మోసుకొస్తాయి. ఈ అనారోగ్యాలతో పోరాడటానికి. రోగనిరోధకశక్తి బలంగా ఉండటం చాలా ముఖ్యం. వర్షాకాలంలో వ్యాధి నిరోధక శక్తిని మరింత పెంచుకోవడానికి నిత్యం తీసుకునే ఆహారంలో కొన్ని మార్పులు చేసుకోవడం అవసరం. ఆ మార్పులేమిటో, ఈ సీజన్‌లో ఏ ఆహారం తీసుకుంటే మంచిదో చూద్దాం...



ముసురు పట్టినప్పుడు వేడి వేడి టీ, కాఫీలు తాగుతుంటారు. అయితే వాటికి బదులు గ్రీన్ టీ, బ్లాక్ టీ, హెర్బల్ టీ వంటివి తీసుకోవాలి. దాంతోపాటు అల్లం, మిరియాలు, తేనెతో తయారు చేసిన టీ సేవిస్తే.. ఆరోగ్యానికి చాలా మంచిది. అదేవిధంగా బజ్జీలు, పునుగులు, బోండాలకు బదులు వేడి వేడి ఉగ్గాణి, సెనగ, పెసర గుగ్గిళ్లు, చుడువా, సగ్గుబియ్యం కిచిడీ మంచిది. పుదీనా, తులసి ఆకుల్లో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్ గుణాలు అధికంగా ఉంటాయి కాబట్టి వీటితో కషాయం కాచుకుని తాగితే మంచిది. రాగులు, సోయా బీన్, పెసలు, మొక్కజొన్న వంటి పప్పుధాన్యాలను ఆహారంలో భాగంగా చేసుకుంటే ఎలాంటి అనారోగ్య సమస్యలూ దరిచేరవు. వీటితోపాటు పోషక విలువలు ఎక్కువగా ఉండే కూరగాయలు, పండ్లు అంటే దానిమ్మ, ఆపిల్, స్ట్రాబెర్రీ, అరటి, క్యాబేజీ, క్యాలీఫ్లవర్, బచ్చలి కూర వంటివి తీసుకుంటే మంచిది.



అల్లం: ఇది శరీర కణజాలాలకు పోషకాలను సమీకరించడానికి, సరఫరా చేయడానికి తోడ్పడుతుంది. ఈ రోజుల్లో జలుబు, దగ్గు వంటి సమస్యలు సర్వసాధారణం. అల్లం కఫాన్ని తగ్గిస్తుంది కాబట్టి అల్లం టీ తాగితే జలుబు, దగ్గు దూరం అవుతాయి. ఫ్లూతో పోరాడటానికి అల్లం తోడ్పడుతుంది. అల్లంలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు రోగనిరోధక శక్తినీ మెరుగుపరుస్తాయి. టీలు, సూప్‌లు, కూరల్లో అల్లాన్ని ఎక్కువ ఉపయోగిస్తే వ్యాధి నిరోధక తను పెంచుకోవచ్చు.



నేరేడు పండు... ఈ పండులో ఉండే విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు, ఖనిజాలూ ఫైటోకెమికల్సూ రోగనిరోధక శక్తిని మెరుగుపరుస్తాయి. నేరేడులో క్యాలరీలు తక్కువ. వానాకాలంలో వచ్చే అతిసార, కలరా వ్యాధులతో పాటు ఇతరత్రా ఇన్ఫెక్షన్లకీ నేరేడు ఔషధంలా పనిచేస్తుంది.

తులసి... ఈ కాలంలో రోజూ తులసి ఆకులను నమలడం ద్వారా అనారోగ్యాల నుంచి రక్షణ పొందవచ్చు. ఐదు తులసి ఆకులను రాత్రంతా నీటిలో నానబెట్టి.. మరుసటి రోజు ఉదయం పరగడుపునే ఆ ఆకులు తిని.. నీటిని తాగాలి. తులసి రోగనిరోధక వ్యవస్థను బూస్ట్ చేస్తుంది.



నిమ్మ... నిమ్మరసంలో విటమిన్ సి సమృద్ధిగా ఉంటుంది. ఇది శక్తిమంతమైన యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేసి రోగనిరోధక శక్తిని పెంపొందిస్తుంది. అంతేకాదు, శరీరంలో తెల్ల రక్త కణాల ఉత్పత్తిని పెంచుతుంది. ఇది ఇన్ఫెక్షన్లు, అంటువ్యాధుల నుంచి శరీరాన్ని రక్షిస్తుంది.

మిరియాలు... నల్ల మిరియాలలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడంలో సహాయపడతాయి. జీవక్రియలను పెంచుతాయి. దగ్గు, గొంతు నొప్పి ఉన్నట్లయితే నల్ల మిరియాలను పొడి చేసి నిద్రవేళకు ముందు వేడి పాలలో కలుపుకొని తాగితే ఆరోగ్యానికి చాలా మంచిది.



పసుపు... పసుపులో యాంటీ బాక్టీరియల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరాన్ని అనేక వ్యాధుల నుంచి రక్షించడంలో సహాయపడతాయి. రోజూ రాత్రిపూట చిటికడు పసుపు కలిపిన వేడి పాలు తాగితే రోగనిరోధక శక్తి పెరుగుతుంది.

వీటికి దూరంగా ఉండటం మేలు!

రోగనిరోధక శక్తిని బలోపేతం చేయాలంటే చక్కెర పదార్థాలకి దూరంగా ఉండాలి. ముఖ్యంగా ఐస్ క్రీం, కేక్, క్యాండీ, చాక్లెట్, కూల్‌డ్రింక్స్ తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి తగ్గుతుంది. అలాగే ఉప్పు ఎక్కువగా ఉండే ఆహారాలు ఆరోగ్యానికి చాలా హాని కలిగిస్తాయి. రోగనిరోధక శక్తిని బలహీనపరుస్తాయి. చాలామంది ప్యాక్ చేసిన ఆహారాలని తినడానికి ఎక్కువగా ఇష్టపడుతారు. కానీ ఇవి ఆరోగ్యానికి మంచివి కావు. అధిక ఉప్పు ఆటో ఇమ్యూన్ వ్యాధి ప్రమాదాన్ని పెంచుతుంది. అలాగే ఆల్కహాల్, ధూమపానం కూడా శరీరాన్ని బలహీనంగా మారుస్తాయి. అందుకే వీటికి వీలైనంత దూరంగా ఉంటే మేలు.



లవంగం... ఇది రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడానికి పనిచేస్తుంది. వర్షాకాలంలో లవంగాలను తీసుకుంటే గొంతు నొప్పి వంటి సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చు.



దాల్చిన చెక్క... అద్భుత ఔషధ గుణాలెన్నో దాగి ఉన్న దాల్చిన చెక్క మధుమేహులకు రక్తంలో చక్కెర శాతాన్ని తగ్గిస్తుంది. రోజూ గ్లాసు పాలలో దాల్చిన చెక్క పొడి కలుపుకొని తాగితే రోగనిరోధక శక్తి పెరుగుతుంది. అంతేకాదు, శరీరంలో ఉండే కొవ్వు శాతాన్ని తగ్గించే గుణం దీనిలో ఇమిడి ఉంది.

బడికి వెళ్లనని మారాం చేస్తున్నారా?

ఉదయాన్నే పిల్లల్ని తయారు చేసి స్కూలుకు పంపించడం పేరెంట్స్‌కు పెద్దపని. ఇంతకంటే వాళ్లను నిద్రలేపడం అతిపెద్ద టాస్క్. ఎంత లేపినా నిద్ర లేవరు. కింద స్కూల్ ఆటోనో, బస్సో వచ్చి హారన్ కొడుతుంటుంది. కానీ వీళ్లు లేవరు. వీళ్లను తొందరగా నిద్ర లేపాలంటే ఇలా ప్రయత్నించి చూడండి....



సమస్యను అర్థం చేసుకోవాలి
ముందుగా నిద్ర లేవడానికి ఏమైనా ఇబ్బంది పడుతున్నారేమో గమనించాలి. రాత్రి సరిగా పడుకున్నారా లేదా... అసలు నిద్రపట్టలేదా... ఇంకేదైనా సమస్య ఉంటే అనునయంగా అడిగి తెలుసుకోవాలి.

సరిపోయిందా లేదా?
స్కూలుకెళ్లే పిల్లలు కనీసం పదిగంటలు నిద్రపోవాలి. గేమ్స్, ఫోన్లు చూస్తూ సరిగా పడుకోరు. రోజూ ఒక నిర్దేశిత సమయాన్ని కేటాయించి వాళ్లు కచ్చితంగా పడుకునేలా చేయాలి.

ప్రేమతో లేపాలి
ఉదయం ఎంత ఉత్సాహంగా లేస్తే రోజంతా అలానే గడుస్తుంది. అందుకే పిల్లలు త్వరగా లేవకపోయినా ప్రేమగా నిద్రలేపాలి. పిల్లలకు అర్థమయ్యే ప్రేమ భాషలోనే నిద్ర లేపాలి. ఇందుకోసం వాళ్లకు నచ్చే మంచి విషయాలు, స్కూలుకు వెళ్లడం ఎంతముఖ్యమో ప్రేమతో చెప్పాలి.

ఇష్టమైన ఫుడ్
పిల్లలు ఇష్టంగా తినే ఆహారాన్ని బ్రేక్‌ఫాస్ట్‌లో ఇవ్వాలి. అది తినడం కోసం అయినా త్వరగా నిద్ర లేస్తారు. ఈ నాలుగు చిట్కాలు ప్రయత్నిస్తే మీ సమస్య తీరినట్టే.

దిండు లేకుండా పడుకోలేరా?

రాత్రిపూట నిద్రించేటప్పుడు చాలా మంది తలకింద దిండు పెట్టుకొని పడుకుంటారు. అయితే తక్కువ ఎత్తు ఉన్న దిండు ఫరవాలేదు కానీ, పెద్ద దిండు పెట్టుకోవడం వల్ల చాలా ఆరోగ్య సమస్యలు ఏర్పడుతాయి. ఇది మొదట్లో తెలియదు కానీ కొన్ని రోజులు గడిచిన తర్వాత ముందుగా మెడ నొప్పి ఎదురవుతుంది. ఈ నొప్పి దీర్ఘకాలికంగా వేధిస్తుంది. కొంతమందికి ఉదయం నిద్రలేవగానే వెన్నులో నొప్పితో బాధపడతారు. మీకు ఇలాంటి సమస్య ఎదురైతే పడుకునేటప్పుడు మీరు ఎత్తయిన దిండు ఉపయోగిస్తున్నట్లు లెక్క. దీనివల్ల వెన్నెముక వంగిపోతుంది. డిస్క్‌లలో దూరం పెరిగి వెన్నునొప్పి వస్తుంది. అందువల్ల దిండు లేకుండా నిద్రించడం అలవాటు చేసుకోవాలి.



తలలో రక్త ప్రసరణ జరగదు: ఎత్తయిన దిండు పెట్టుకొని నిద్రపోతే తలకి రక్త సరఫరా సరిగ్గా జరగదు. రాత్రిపూట చాలా గంటలు ఇలాగే ఉండటం వల్ల రక్త సరఫరా లేక జుట్టుకు సరైన పోషణ లభించదు. దీనివల్ల జుట్టు రాలే సమస్య మొదలవుతుంది. అంతేకాదు, తరచు తలనొప్పి వస్తుంది. లావుపాటి దిండు పెట్టుకొని నిద్రించడం వల్ల శరీరంలోని కొన్ని భాగాలకి రక్త సరఫరా సరిగ్గా అందక తిమ్మిర్ల సమస్యలు ఏర్పడుతాయి. అందువల్ల మెడనొప్పి ఉండకూడదంటే తక్కువ ఎత్తు ఉండే చిన్న దిండుని ఉపయోగించాలి లేదంటే మెత్తటి టవల్ లేదా పలుచటి దుప్పటిని మడత పెట్టి తలకింద పెట్టుకోవడం ఉత్తమం.

హెల్త్ టిప్స్

మందారం ఆకుల్ని నూరి షాంపూగా వాడితే జుత్తు బాగా పెరుగుతుంది. చుండ్రు నివారణలోనూ, తెల్ల వెంట్రుకల నిరోధకంలోనూ సాయమవుతుంది. కప్పు నీటిలో ఒక మందార పువ్వు వేసి మరిగించి ఆ నీళ్లను తాగితే రక్తంలో ఐరన్ పెరుగుతుంది.

కరివేపాకులో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఓ 10 ఆకులతో పేస్ట్ తయారు చేసి మజ్జిగలో కలిపేసుకుని రోజూ తాగితే కాలేయం వ్యర్థపదార్థాల నుంచి రక్షణ పొందుతుంది. రోజూ ఓ 8 ఆకుల్ని మిరియాలతో కలిపి తింటే ముక్కులో వచ్చే అలర్జీలు తగ్గిపోతాయి.

రోజూ రెండు మూడు పుదీనా ఆకుల్ని నమిలి మింగుతుంటే జీర్ణశక్తి పెరిగి, కడుపు ఉబ్బరం, తేన్పులు తగ్గుతాయి. శ్వాసకోశాల శక్తి పెరుగుతుంది.

వేపాకు, యాంటీ సెప్టిక్‌గానూ, క్రిమి సంహారిణిగానూ బాగా పనిచేస్తుంది. వేపాకు పొడిని నీళ్లల్లో కలిపి చల్లితే ఎన్నో రకాల క్రిమి కీటకాలు దూరంగా వెళ్లిపోతాయి. వేపాకుల్ని నీటిలో వేసి మరిగించి స్ప్రే చేస్తే దోమల బెడద తప్పుతుంది. వేపాకు పొడిని పేస్ట్‌గా చేసి వాడితే పలు రకాల చర్మ సమస్యలు, మొటిమలు, ఎగ్జిమాల బాధలు తప్పుతాయి.

పసుపును పేస్ట్‌గా రోజూ ముఖానికి వాడితే, ముఖం మీద ఉండే సన్నని వెంట్రుకలు రాలిపోతాయి. అలాగే మొటిమలు, మచ్చలు కూడా మాయమవుతాయి. ఇది గొప్ప యాంటీ ఆక్సిడెంటు కాబట్టి రోజు మొత్తంలో ఒక టీ స్పూను దాకా కడుపులోకి తీసుకోవచ్చు.

సినిమా

అంతం ఆరంభమవుతుంది!


ప్రభాస్

వెండితెరపై ప్రభాస్ కల్కి అవతారం ఎత్తారు. ప్రభాస్, కమల్‌హాసన్, అమితాబ్ బచ్చన్, దీపికా పదుకోన్, దిశా పటానీ ముఖ్య తారలుగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో 'ప్రాజెక్ట్ కె' వర్కింగ్ టైటిల్‌తో ఓ సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్ రూపొందుతున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం అమెరికాలో జరుగుతున్న 'శాన్ డియాగో కామిక్ కాన్ – 2023' వేడుకలో ఈ సినిమాకు 'కల్కి 2898 ఏడీ' టైటిల్‌ను ఖరారు చేసినట్లు శుక్రవారం వెల్లడించి, గ్లింప్స్ వీడియోను రిలీజ్ చేశారు. 'ప్రపంచాన్ని చీకటి కమ్మేసినప్పుడు ఒక శక్తి ఉద్భవిస్తుంది. అప్పుడు అంతం ఆరంభం అవుతుంది' అన్నట్లుగా ఈ వీడియోలో ఉంది. ఈ వేడుకలో కమల్‌హాసన్ మాట్లాడుతూ– ''మేం స్టోరీలు చేస్తుంటే వారు (ఆడియన్స్) మమ్మల్ని స్టార్స్ చేస్తున్నారు. 'కల్కి 2898 ఏడీ'లో పెద్ద విజన్ ఉంది. ఈ సినిమాలో భాగం కావడం గౌరవంగా ఉంది'' అన్నారు. ''ఈ సినిమాలో నాగ్ అశ్విన్ నా క్యారెక్టర్‌ను డిజైన్ చేసిన తీరు బాగా నచ్చింది. సినిమాలో స్ట్రాంగ్ ఎమోషన్స్ ఉన్నాయి'' అన్నారు ప్రభాస్. ''ఈ సినిమా నాకో అద్భుతమైన అనుభవం. దీని వెనక గొప్ప పరిశోధన ఉంది'' అని వర్చ్యువల్‌గా అమితాబ్ బచ్చన్ మాట్లాడారు. ''నేను సైన్స్ ఫిక్షన్, పురాణాలను ఇష్టపడతాను. మహాభారతం, స్టార్ వార్స్... రెండింటినీ చూస్తూ, వింటూ పెరిగాను. ఈ రెండు ప్రపంచాలను కలిపే ఒక గొప్ప సినిమా చేయాలనుకున్నప్పుడు 'కల్కి 2898 ఏడీ' పుట్టింది'' అన్నారు నాగ్ అశ్విన్. ''ఈ సినిమా మాకు గర్వ కారణం'' అన్నారు నిర్మాత అశ్వనీదత్. ఈ వేడుకలో రానా, ప్రియాంకా దత్, స్వప్నా దత్ పాల్గొన్నారు. 'కల్కి 2898 ఏడీ'ను 2024 జనవరి 12న రిలీజ్ చేయాలనుకుంటున్నారు.

రామ్‌చరణ్‌తో కలిసి నటిస్తా: ప్రభాస్
రామ్‌చరణ్‌తో కలిసి నటిస్తానని ప్రభాస్ 'కామిక్ కాన్–2023' వేడుకల్లో చెప్పారు. ఈ వేడుకల్లో 'ఆర్ఆర్ఆర్' సినిమా ప్రస్తావన రాగా... ''భారతదేశంలో ఉన్న అద్భుతమైన దర్శకుల్లో రాజమౌళి గారు ఒకరు. 'ఆర్ఆర్ఆర్' సినిమాలోని పాటకు ఆస్కార్ రావడం నాకు చాలా సంతోషంగా అనిపించింది. అది దేశ ప్రజలందరికీ దక్కిన గౌరవంగా భావించాం. అలాగే రామ్‌చరణ్ నాకు మంచి మిత్రుడు. ఏదో ఒక రోజు మేం కచ్చితంగా కలిసి సినిమా చేస్తాం'' అని చెప్పుకొచ్చారు ప్రభాస్.


చిరంజీవి, తమన్నా

మిల్కీ బ్యూటీ... నువ్వే నా స్వీటీ

'అచ్చ తెలుగు పచ్చి మిర్చి మగాడు వీడే.. బొంబాటు ఘాటు హాటు హాటుగున్నాడే.. కల్లోకి వచ్చేసి కన్నెగుండెల్లో సూది గుచ్చి పిల్లా నీ ముచ్చటేంది అన్నాడే...' అంటూ రొమాంటిక్ మోడ్‌లోకి వెళ్లిపోయారు హీరోయిన్ తమన్నా. చిరంజీవి టైటిల్ రోల్‌లో నటించిన తాజా చిత్రం 'భోళా శంకర్'. ఈ చిత్రంలో చిరంజీవి సరసన తమన్నా నటించగా, ఆయన చెల్లెలి పాత్రలో కీర్తీ సురేష్ నటించారు. మెహర్ రమేష్ దర్శకత్వంలో అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 11న విడుదల కానుంది. ఈ చిత్రంలోని 'మిల్కీ బ్యూటీ.. నువ్వే నా స్వీటీ..' అంటూ సాగే పాట లిరికల్ వీడియోను శుక్రవారం విడుదల చేశారు. రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించిన ఈ పాటను విజయ్ ప్రకాష్, సంజన కల్మంజేతో కలసి ఈ చిత్ర సంగీతదర్శకుడు మహతి స్వర సాగర్ ఆలపించారు.


సుదీప్, అమలాపాల్

యాక్షన్ హెబ్బులి

సుదీప్, అమలా పాల్ జంటగా ఎస్. కృష్ణ దర్శకత్వంలో రూపొందిన కన్నడ రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ 'హెబ్బులి'. ఈ సినిమాను అదే టైటిల్‌తో సి. సుబ్రహ్మణ్యం ఆగస్టు 4న తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ– ''ఫ్యామిలీ ఎమోషన్స్, యాక్షన్, రొమాంటిక్ సీన్స్ మిళితమై ఉన్న పక్కా కమర్షియల్ ఫిల్మ్ 'హెబ్బులి'. కన్నడంలో రూ. 100 కోట్లు సాధించింది. తెలుగులోనూ హిట్ అవుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు.


వైష్ణవ్ తేజ్


మహేశ్‌బాబు


టొవినో థామస్

కిక్... పంచ్...

విలన్ ముఖం మీద హీరో పంచ్ ఇవ్వాలా? కాలితో ఒక్క కిక్ కొట్టాలా? గాల్లో ఎగిరి పల్టీలు కొట్టి మరీ విలన్‌ని కొట్టాలా? ఇవన్నీ చేయాలంటే కాస్త ట్రైనింగ్ కావాలి. రెగ్యులర్ ఫైట్స్‌కి అయితే అక్కర్లేదు. బీభత్సమైన ఫైట్స్‌కి అయితే శిక్షణ తీసుకోవాల్సిందే. అది హీరో అయినా హీరోయిన్ అయినా. ఈ మధ్య రిస్కీ రోల్స్ ఒప్పుకున్న కొందరు స్టార్స్ 'మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్' నేర్చుకోవడానికి ప్రిపేర్ అయ్యారు. కిక్ బాక్సింగ్, కరాటే, కుంగ్ ఫూ, జూడో, కలరి పయట్టు వంటివన్నీ మార్షల్ ఆర్ట్స్ కిందే వస్తాయి. ఫైట్‌కి సూట్ అయ్యే ఆర్ట్ నేర్చుకుని బరిలోకి దిగనున్న స్టార్స్ గురించి తెలుసుకుందాం.

మూడు నెలలు బ్యాంకాక్‌లో...
హీరో మహేశ్‌బాబు– డైరెక్టర్ రాజమౌళి కాంబినేషన్‌లో ఓ భారీ చిత్రం రూపొందనున్న విషయం తెలిసిందే. ఆఫ్రికన్ అడవుల నేపథ్యంలో జరిగే ఈ కథలో భారీ యాక్షన్ సన్నివేశాలు ఉంటాయట. పోరాట సన్నివేశాలు సహజంగా ఉండేందుకు కెరీర్‌లో తొలిసారి ఈ సినిమా కోసం మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోనున్నారట మహేశ్ బాబు. ఇందుకోసం మూడు నెలల పాటు బ్యాంకాక్ వెళతారని టాక్. అక్కడ మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ ట్రైనింగ్, హైకింగ్, ట్రెక్కింగ్ వంటివి నేర్చుకోనున్నారట. ఈ శిక్షణ ఇవ్వనున్న బ్యాంకాక్ స్టంట్ టీమ్‌కి ఓ హాలీవుడ్ ప్రముఖ స్టంట్ కొరియోగ్రాఫర్ నేతృత్వం వహిస్తారని తెలిసింది. ప్రస్తుతం త్రివిక్రమ్ దర్శకత్వం వహిస్తున్న 'గుంటూరు కారం'లో నటిస్తున్నారు మహేశ్‌బాబు. ఈ చిత్రం పూర్తయ్యాక బ్యాంకాక్‌లో శిక్షణ తీసుకుని, రాజమౌళి సినిమా షూట్‌లో జాయిన్ అవుతారట. ప్రస్తుతం ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉన్నారు రాజమౌళి. ఈ చిత్రానికి రాజమౌళి తండ్రి విజయేంద్ర ప్రసాద్ కథ అందిస్తున్న సంగతి తెలిసిందే.


కాజల్

థాయ్‌ల్యాండ్‌లో...
తొలి చిత్రం 'ఉప్పెన'తో (2021) బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నారు వైష్ణవ్ తేజ్. ఆ తర్వాత 'కొండపొలం, రంగ రంగ వైభవంగా' వంటి చిత్రాల్లో నటించారు. ఈ మూడు చిత్రాల్లో సాఫ్ట్ క్యారెక్టర్‌తో ప్రేక్షకులను అలరించిన ఆయన తొలిసారి 'ఆదికేశవ' చిత్రంలో ఫుల్ యాక్షన్ రోల్ చేశారు. శ్రీకాంత్ ఎన్. రెడ్డి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో హై ఓల్టేజ్ యాక్షన్ సన్నివేశాల కోసం థాయ్‌ల్యాండ్‌లో మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ తీసుకున్నారు వైష్ణవ్ తేజ్. ఈ చిత్రంలో వైష్ణవ్‌కు జోడీగా శ్రీలీల నటించారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ సినిమా ఆగస్టు 18న రిలీజ్ కానుంది.

కలరి మార్షల్ ఆర్ట్‌లో...
మలయాళ హీరో టొవినో థామస్ కలరి అనే మార్షల్ ఆర్ట్‌లో శిక్షణ పొందారు. టొవినో థామస్ హీరోగా నటిస్తున్న చిత్రం 'అజయంతే రండం మోషణం'. జితిన్ లాల్ దర్శకత్వం వహిస్తున్నారు. కథ పరంగా కేరళలోని కలరి అనే మార్షల్ ఆర్ట్‌కు ఈ చిత్రంలో ప్రాధాన్యం ఉండటంతో టొవినో థామస్ ఈ విద్యలో శిక్షణ తీసుకుని నటిస్తున్నారు. ఈ చిత్రంలో కృతీ శెట్టి, ఐశ్వర్య రాజేష్, సురభి లక్ష్మి హీరోయిన్లుగా నటిస్తున్నారు.

భారతీయుడు కోసం...
కమల్‌హాసన్ హీరోగా శంకర్ దర్శకత్వం వహిస్తున్న 'భారతీయుడు 2' కోసం కాజల్ అగర్వాల్ మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ తీసుకున్నారు. 'భారతీయుడు' (1996) సినిమాకి సీక్వెల్‌గా 'భారతీయుడు 2' (తమిళంలో 'ఇండియన్ 2) రూపొందుతోంది. ఈ చిత్రంలో కమల్‌కు జోడీగా కాజల్ నటిస్తున్నారు. ఈ చిత్రంలో పవర్‌ఫుల్ ఫైట్స్ చేయడం కోసం అతిపురాతనమైన యుద్ధ క్రీడ కలరి పయట్టు నేర్చుకున్నారు కాజల్. కలరి సాధన చేస్తున్న ఓ వీడియోను ఆమె సోషల్ మీడియాలో పోస్ట్ చేసి, 'షావోలిన్, కుంగ్ ఫూ, కరాటే, తైక్వాండో.. వంటి క్రీడలు కలరి నుంచి పుట్టుకొచ్చినవే' అని పేర్కొన్నారామె. ఈ మూవీ కోసం గుర్రపు స్వారీ కూడా నేర్చుకున్నారు కాజల్ అగర్వాల్.

కోలీవుడ్‌లో ఫెఫ్సీ కొత్త నిబంధనలు

● సినిమా షూటింగ్‌లకు ఫెఫ్సీ కొత్త నియమాలు ● వెల్లువెత్తుతున్న విమర్శలు

దక్షిణ భారత సినీ కార్మికుల సంఘం (ఫెఫ్సీ) కొత్త నియమ, నిబంధనలు కోలీవుడ్‌లో చర్చనీయాంశమయ్యాయి. తమిళ చిత్రాలకు స్థానిక నటీనటులు, సాంకేతిక నిపుణులు మాత్రమే పని చేయాలని, తమిళ సినిమాల చిత్రీకరణలు తమిళనాడులోనే జరగాలని, సరైన కారణాలు లేనిదే అవుట్‌డోర్ లొకేషన్స్‌లో షూటింగ్ జరపకూడదని ఫెఫ్సీ కొత్త నియమాలు చేసిందని సమాచారం. అలాగే అనుకున్న సమయంలోపు సినిమా చిత్రీకరణ పూర్తి కాకపోయినా, బడ్జెట్ పరిమితి దాటినా నిర్మాతలకు సరైన కారణాలతో లిఖిత పూర్వకమైన లేఖను సమర్పించాలని, ఒకవేళ ఓ సినిమాకు దర్శకుడే రచయిత అయితే, ఆ సినిమా కథకు సంబంధించి ఏదైనా సమస్య ఉంటే అతనే పరిష్కరించుకోవాలని, ఆ సమస్య ప్రభావం షూటింగ్, నిర్మాతలపై పడకుండా జాగ్రత్త వహించే బాధ్యత కూడా ఆ వ్యక్తే తీసుకోవాలన్నట్లుగా కొన్ని నియమాలను 'ఫెఫ్సీ' తీసుకొచ్చిందట. ఈ కొత్త నిర్ణయాలపై కోలీవుడ్‌లోనే కాదు.. సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 'ఈ నిబంధనలు ఉన్నప్పుడు తమిళ సినిమాలను తమిళనాడులోనే రిలీజ్ చేసుకోవాలి. కోలీవుడ్‌లో హీరోయిన్లకు కొరత ఏర్పడుతుంది. సినిమాకి వాడే సాంకేతిక సామాగ్రిని కూడా తమిళనాడులోనే తయారుచేసుకోవాలి' అంటూ ఫెఫ్సీ నియమాలపై సోషల్ మీడియాలో కొందరు నెటిజన్లు వ్యంగ్యాస్త్రాలు విసురుతున్నారు. అయితే ఈ కొత్త నియమాలను కొందరు తప్పుగా అర్థం చేసుకున్నారని ఫెఫ్సీ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి పేర్కొన్నారట.